**కథ**

# లోక కళ్యాణం

-కోరుకొండ సూర్యకుమారి

మొన్ననే నాకు ఇరవయ్యేళ్ళు నిండాయి. రెండేళ్ళ నుండీ మా నాన్న సంబంధాలు వెతుకుతున్నారు. కానీ ఎవర్నీ మా ఇంటి గుమ్మం వరకైనా తీసుకురాలేకపోయారు.

ఫలానా చోట ఓ సంబంధం ఉందని తెలుసుకొనే లోగానే ఆ అబ్బాయికి సంబంధం కుదిరిపోవడం, ఫలానా ఊళ్ళో అమ్మాయిని చూసిం తర్వాత మీ అమ్మాయిని చూడ్డానికి వస్తామని మాటిచ్చినా - ఆ అమ్మాయితోనే సంబంధం సెటిలైపోవడం... ఇలా రకరకాల కారణాల వల్ల ఇంతవరకూ ఎవ్వరూ మా ఇంటికి రాలేదు నన్ను చూడ్డానికి.

నా తోటి పిల్లలకు పెళ్ళిళ్ళైపోయాయని, కొందరికైతే పిల్లలు కూడా పుట్టేసారని, ఈ సంవత్సరమైనా పెళ్ళి చేస్తారా లేదా అని అమ్మ పెట్టే పోరు ఈ మధ్య మరీ ఎక్కువైపోవడంతో నాన్న ఇంక అదే పనిగా తిరగడం మొదలు పెట్టేరు.

అందుకు ఫలితంగా మా ఇంటికి మొట్టమొదటి సారిగా ఒక అబ్బాయి తల్లిదండ్రులతో, బంధుమిత్రులతో వచ్చాడు. నేను ఒక గదిలో కూర్చున్నాను, ముస్తాబై. అదే మొదటి పెళ్ళి చూపులు. అందుకే బెరుగ్గా ఉంది. గుండె దిటవు చేసుకొనే ప్రయత్నంలో నేనున్నాను.

వచ్చిన వాళ్ళు ఫలహారాలు, కాఫీలు పూర్తి చేసినట్టున్నారు. అప్పుడు వచ్చింది అమ్మ నేనున్న గదిలోకి.

'ఎడమ వైపు కుర్చీలో తెల్లగా, పొడవుగా, ఉంగరాల జుత్తుతో నీలం రంగు పాంటులో సిమెంటు రంగు ఫుల్ చేతుల చొక్కా టక్ చేసుకున్న అబ్బాయి ఉంటాడు. ఆ అబ్బాయి పెళ్ళికొడుకు ఫ్రెండట. కుడి ప్రక్క పేము కుర్చీలో కూర్చున్న అబ్బాయే పెళ్ళికొడుకు.'

ఫ్రెండుని వర్ణించి చెప్పిన అమ్మ పెళ్ళికొడుకుని వర్ణించి చెప్పకపోవడంతో నాకు నవ్వొచ్చింది. తల వంచుకొని, అడుగులో అడుగు వేసుకుంటూ నెమ్మదిగా వాళ్ళు ముందుకి వెళ్ళి కూర్చున్నాను. అమ్మ నన్ను చాప మీద కూర్చోబెడుతూ 'కుడి వైపుకి చూడూ' అంది నా చెవిలో.

నేను కుడి వైపుకి కొద్దిగా తలెత్తి చూసాను. వెంటనే తల దించుకున్నాను. అప్పుడర్థమైంది అమ్మ పెళ్ళికొడుకుని ఎందుకు వర్ణించి చెప్పలేదో. పది నిముషాల తర్వాత వచ్చిన వాళ్ళలో ఒకాయన 'లోపలకు వెళ్ళమ్మా' అని అనడంతో నేను లేచి గదిలోకి వెళ్ళిపోయాను.

మరో పావు గంటలో వాళ్ళందరూ వెళ్ళిపోయారు. తర్వాత గంటకుపైగా ఆ సంబంధం గురించిన చర్చలే సాగాయి ఇంట్లో. వాళ్ళ ఆస్తి, పెళ్ళి కొడుకు ఉద్యోగం, సంపాదన లాంటి విషయాల గురించే గొప్పగా చెప్పుకుంటున్నారు. పెళ్ళి కొడుకు గురించి వాళ్ళ మనసుల్లో ఏముందో గానీ ఎవరూ పైకి ఏమీ అనలేదు. నేను కూడా పైకి ఎవరి దగ్గరా ఏమీ అనలేదు.

ఆ రాత్రి నాకు నిద్ర పట్టలేదు. పగలంతా మా వాళ్ళు మాట్లాడుకున్న మాటలే నాకు గుర్తొచ్చాయి. ఆ మాటల్ని బట్టి ఆ సంబంధం ఖాయం చేసేటట్టే ఉన్నారు. ఆ ఆలోచనకే నా మనసదోలా అయిపోయింది.

దాహం వేస్తుండడంతో లేచాను. వంట గదిలోకి వెళ్ళాను. ప్రక్క గదిలో పడుకున్న అమ్మా నాన్నలు ఇంకా మాట్లాడుకుంటున్నారు. అప్రయత్నంగానే వాళ్ళ మాటలు విన్నాను.

'అన్నీ బాగానే ఉన్నాయండి. ఒక విధంగా మన అమ్మాయి అదృష్టవంతురాలే ఆ సంబంధం ఖాయం అయితే....'

'అవును శాంతా. ఆ భగవంతుడి దయవల్ల ఈ మొదటి సంబంధమే కుదిరిపోతే లలితతో పాటు మనం కూడా అదృష్టవంతులమే అవుతాం'

'కట్నం ఏమాత్రంలో ఉన్నారట?'

'మధ్యవర్తి చెప్పాడు ఏభై వేలులో ఉన్నారని'.

'ఏభై వేలు కట్నం, లాంఛనాలు, పెళ్ళి ఖర్చులు.... చాలా అయిపోతుంది కదండీ...'

'అవనీ శాంతా. మనకి అప్పు అయినా, అమ్మాయి సుఖపడితే అదేచాలు...'

'ఏవండీ, చిన్నమాట. అబ్బాయి గురించే నాకు కొంచెం ఇదిగా ఉందండీ...'

'నేనూ నీలాగే ఆలోచించాను శాంతా. కానీ పెళ్ళిళ్ళ విషయంలో అలాంటి విషయాలు ఆలోచించగూడదు.'

'మనమ్మాయి ప్రక్కన బాగా పెద్దవాడిలాగా... ఇప్పుడే పిల్లల తండ్రిలాగా ఉన్నాడు ఆ బొజ్జవల్ల, బుగ్గల వల్ల....'

'ఒళ్ళు మీద అలా ఉన్నాడు గానీ వయసు తక్కువే శాంతా. పెళ్ళయ్యాక వచ్చిందనుకో ఆ ఒళ్ళు. అప్పుడేం చేస్తాం చెప్పు? అయినా నాతో అంటే అన్నావు గానీ లలితతో అనేవు?'

'మనసులో మాట మీకు కాబట్టి చెప్పాను గానీ, లలితతో ఎందుకు అంటానండి?'

నేను మంచి నీళ్ళు త్రాగి నా గదిలోకి వెళ్ళిపోయాను.

అంటే... నాలో ఉన్న ఆలోచనే అమ్మానాన్నలకూ ఉందన్నమాట. నా అభిప్రాయాన్ని ఏ మాత్రం అడగకపోగా, నేను కాదనడానికి ఆసరా అవుతుందేమోనని వాళ్ళు తమ అభిప్రాయాన్ని మనసుల్లోనే సమాధి చేసుకుంటున్నారన్నమాట.

ఇలాంటి సమయంలో వీళ్ళైనా, అందరి తల్లిదండ్రులూ ఇలాగే ప్రవర్తిస్తారా? ఏమో.

ఆ రాత్రి నేనసలు నిద్రపోలేదు.

రెండ్రోజుల తర్వాత నాన్న మధ్యవర్తి దగ్గరకు వెళ్ళి వచ్చారు, ఓ శుభవార్తతో. ఆ వార్త విని నేను ఎంతో ఆనందపడ్డాను.

'అమ్మాయి సన్నగా ఉందట. అబ్బాయికి మరి కాస్త ఒళ్ళున్న అమ్మాయి కావాలట. ఏమీ అనుకోవద్దని చెప్పమన్నారట'

ఆ సంబంధం కుదరకపోవడం నాకు ఆనందాన్ని కలిగించినా, అందుకు కారణం నా పర్సనాలిటీ కావడం కొంచెం బాధ కలిగించింది. అయితే ఆ బాధ కూడా ఎంతో సేపు లేదు.

కానీ ఆ మర్నాటి నుండీ నాకు మరో రకం బాధ మొదలైంది.

'మగ పిల్లల కళ్ళకు ఇంపుగా కన్పించాలంటే ఒళ్ళు ఉండాలి. వయసులో ఉన్న అమ్మాయంటే పనసతొనలా ఉండాలి. నిగారింపు కన్పించాలి. నేను చెప్తే వింటావా నువ్వు. పసి పిల్లలా తింటే ఒంటికి నిగారింపేం వస్తుంది. నీ వయసులో మేం ఎలా తినేవాళ్ళం. ఎలా ఉండేవాళ్ళం' అంటూ అమ్మ మొదలు పెట్టింది.

ఆ పూట నుండే నాకు దగ్గరుండి అన్నీ తినిపించసాగింది.

నా మనసుకి నచ్చని అతని అభిప్రాయాన్ని పట్టుకొని వ్రేళ్ళాడే అమ్మని చూసి ముందు జాలేసింది. ఆ తర్వాత చిరాకేసింది.

కానీ వారం రోజుల తర్వాత నన్ను చూడ్డానికి వచ్చిన అబ్బాయి స్మార్ట్‌నెస్‌ని చూసి కొద్దిగా మనసు పారేసుకున్న నేను మనసు మార్చుకోక తప్పింది కాదు. ఎందుకంటే ఆ అబ్బాయీ నాకు మరికాస్త ఒళ్ళుంటే బాగుండునన్న అభిప్రాయాన్ని వెలిబుచ్చా డట.

అప్పుడు నా మనసు బాధతో మూలిగిన మాట

నిజమే. ఆ రెండో అబ్బాయి మా అమ్మకీ బాగా నచ్చడంతో, ఆ అబ్బాయీ అదే కారణం చెప్పడంతో మా అమ్మ విజృంభించేసింది. నేను చేయడానికి రెండే రెండు పనుల్ని అప్పజెప్పింది.

ఒకటి బాగా తినడం, రెండు బాగా నిద్రపోవడం!

నెల రోజులు దాటేసరికి నాలో అమ్మ అనే 'నిగారింపు' వచ్చింది. మరో నెలకు పనసతొన లాగానూ తయారయ్యాను. దాంతోపాటూ బరువుగా ఉంటున్నట్టు ఫీలింగూ కలిగింది నాకు.

ఈలోగా మరో అబ్బాయి తీసుకు రాబడ్డాడు 'నన్ను చూడ్డానికి. అతనికి నేను నచ్చానో లేదో తెలియలేదు మాకు. ఎందుకంటే వాళ్ళెవ్వరూ నా గురించి ఎటువంటి కామెంటూ చేయలేదట. కట్నం మాత్రం నాన్న ఇవ్వగల దానికన్నా మరో పాతికవేలు ఎక్కువ అడిగారట. అందుకు ఎంత ఆలోచించినా, ఎన్ని త్యాగాలు చేసినా తూగలేని నాన్న కాదనలేక కాదనలేక వీలు కాదనేసారట.

'వాళ్ళకు అంత ఆశ ఏమిటండీ. అమ్మాయి చదువు, సంస్కారం, అందం, కుటుంబ గౌరవం వేటి గురించీ ఆలోచించకుండా కేవలం కట్నం గురించే ఆలోచించారేమిటండీ వాళ్ళు?'

'పిచ్చి శాంతా, అమ్ముడు పోవడం మొదలు పెట్టాక దానికి హద్దుల్ని, పరిమితుల్నీ ఏర్పరచుకోవాలనుకోవడంలో అర్థం లేదే. కొనుక్కొనే స్తోమత ఉన్నవాళ్ళున్నంత కాలం ఏదీ ఖరీదు తగ్గదే...'

అమ్మకు అర్థమయ్యిందో లేదో గానీ నాకు మాత్రం అర్థమయ్యింది. అవి మా నాన్న మాటలే కావని, సగటు ఆడపిల్లల తండ్రి పడే ఆవేదనకు అక్షర రూపాలని.

మరి కొన్నాళ్ళకు మరో సంబంధం వచ్చింది. ఆ కుటుంబం అంతా మాతో చాలా కలుపుగోలుగా మాట్లాడారు. ఆ కాసేపటికే సొంత మనుష్యుల్లా ప్రవర్తించారు. ఆ సంబంధం ఖాయం అయిపోతుందనే మేమందరమూ అనుకున్నాం. ఆ అబ్బాయి నాకూ నచ్చడంతో నేనూ మనసులో ఆశపడ్డాను.

కానీ ఆ సంబంధమూ కుదరలేదు. సుమారుగా మూడు నెలలుగా నేను చేస్తున్న రెండే రెండు పనుల వల్ల.

'... మా వాళ్ళనందర్నీ చూసారుగా. అందరమూ స్లిమ్‌గానే ఉంటాం. స్లిమ్‌నెస్‌నే ఇష్టపడతాం. అమ్మాయి శరీర తత్వం చూస్తుంటే పెళ్ళయ్యాక ఇంకా ఒళ్ళు చేయొచ్చనిపిస్తోంది.'

అమ్మ నా కళ్ళల్లోకి చూడలేకపోయింది.

ఆ తర్వాత నాకు మరికొన్ని పెళ్ళి చూపులు జరిగాయి. కొందరు నన్ను లావన్నారు. మరి కొందరు సన్నమన్నారు. ఇంకొందరు చాలా కోరికలు కోరారు. నేను నచ్చిన వాళ్ళకు మా నాన్న ఇవ్వగలిగే కట్నం బొత్తిగా నచ్చలేదన్నారు.

అల్లుడ్ని కొనుక్కోడానికి మా నాన్న అప్పటి కష్టాడు వేలకు వేలు సంపాదించలేకపోయారు. లావన్నారని సన్నం అవడానికి తిండి మానేయడం, సన్నమన్నారని అదే పనిగా తిని లావవ్వడం లాంటి పిచ్చి పనులు నేనూ చేయలేదు. ఎందుకంటే...

మధ్య తరగతి కుటుంబంలో పుట్టి పెరిగిన నా ఆలోచనలు. మధ్యలో దారి తప్పినా - పెళ్ళి చూపులకు వస్తున్న వాళ్ళ రక రకాల ఆశలు, అభిప్రాయాలూ, ప్రవర్తనలూ చూసిన తర్వాత... ఈ మధ్య అదే పనిగా అనిపిస్తోంది - పెళ్ళి కోసం ఆడపిల్లలు చేయాల్సింది 'డైటింగ్' కాదు... పెళ్ళి పేరిట, సాంప్రదాయాల పేరిట దోచుకోడానికి ప్రేరేపించే పరిస్థితులతో 'ఫైటింగ్' అని. ఆ యుద్ధంలో గెలుపు నాలాంటి ఆడపిల్లలకు కళ్యాణం చేయడమే కాదు - లోక కళ్యాణమే చేయ గలదని!

ఆ గెలుపు కోసం నా వంతు కృషిని పట్టుదలగా చేయాలని నిర్ణయించుకున్నాను! ❑

